

18న వికాస్ జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 18 శుక్రవారం ఉదయం 9.30 గంటలకు 'వికాస' ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో "జాబ్ మేళా" నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ఎస్‌బి మోటార్ కార్స్‌లో టెలికాల్లెర్స్, సేల్స్ ఎక్సిక్యూటివ్, ఫైనాన్స్ మేనేజర్, ఎపి ఎసి ఫైనాన్సియల్ సర్వీసెస్ లో రిలేషన్షిప్ ఆఫీసర్స్, మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్), శ్రీకాళహస్తి పైప్స్ లి ఎ, ఇండస్ కొఫీ ప్రైవేటు లి ఎ, ఇసుజు మోటార్స్ లి ఎ కంపెనీలో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ ఉత్తీర్ణులైన 30 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. వీరి అర్హత మేరకు నెలకు రూ.10 వేలు నుంచి రూ.30 వేలు వరకూ జీతం ఉంటుందని వెల్లడించారు.

వేతన వేదన..!

- ఆర్థిక ఇబ్బందుల్లో హరిత రాయబారులు
- కుటుంబ పోషణకు అష్టకష్టాలు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

జిల్లాలోని పంచాయతీల పరిధిలో చెత్త సేకరించే హరిత రాయబారుల (గ్రీన్ అంబాసిడర్స్)పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలోని అత్యధిక పంచాయతీల్లో ఆరునెలలకుపైగా గౌరవ వేతనాలు అందడం లేదు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కార్మికులు సతమతమవుతున్నారు. కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు.



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

స్వచ్ఛభారత్ మిషన్ అమలులో భాగంగా నాలుగేళ్ల కిందట పంచాయతీల పరిధిలో 250 కుటుంబాలకు ఒకరిని చొప్పున గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. ప్రారంభంలో జిల్లాకు సంబంధించి సుమారు 900 మందికిపైగా నియామకం చేశారు. నెలకు రూ.6 వేల చొప్పున గౌరవ వేతనం ప్రాతిపదికపై వీరికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి వేతనాలు చెల్లించే వారు. కొన్నాళ్లపాటు మంజూరైన తర్వాత కార్పొరేషన్ నుంచి చెల్లింపులు నిలిచాయి. ఈ నేపథ్యంలోనే పంచాయతీల పరిధిలోని 15వ ఆర్థిక సంఘం నిధులతోపాటు జనరల్ నిధుల నుంచి వీరికి గౌరవ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా గౌరవ వేతనాల చెల్లింపులో ఎటువంటి మార్పులు కన్పించలేదు. దీంతో సకాలంలో వేతనాలు అందక వీరి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం సుమారు 760 మంది మాత్రమే పని చేస్తున్నట్లు అంచనా.

జిల్లాలోని 365 పంచాయతీల్లో 280 పంచాయతీల వార్షిక ఆదాయం తక్కువగా ఉండడంతో ప్రభుత్వ జివో అమలుకు నోచుకోవడం లేదు. సాధారణ, ఆర్థిక వనరులు మెరుగ్గా ఉన్న పంచాయితీల్లో నిధులను బట్టి మాత్రమే గ్రీన్ అంబాసిడర్లకు చెల్లింపులు చేస్తున్నారు. చెత్త సేకరణే ధ్యేయంగా బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంచాయతీ నిధుల మళ్లింపుతో వారికి కష్టాలు తప్పడం లేదు. పంచాయతీల పరిధిలో ఆదాయ వనరులు అంతంత మాత్రంగానే ఉండడంతో సకాలంలో జీతాలు అందడం లేదు. నిత్యం పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యే తమకు సకాలంలో వేతనాలు చెల్లించకపోతే ఎలా? అని వారు ప్రశ్నిస్తున్నారు. ఇచ్చే అరకొర జీతం సక్రమంగా చెల్లించుకుంటే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు లేకుండా జీవనం సాగించడం ఎలానో అధికారులే చెప్పాలని వాపోతున్నారు. తడి, పొడి చెత్త సేకరణకు ఉపయోగించే రిక్షాల మరమ్మతులను సైతం వీరే చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి చెత్త సేకరణ పనిలో ఉండడంతో వేరే పనులకు వెళ్లలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లే అవకాశం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం అప్పులు చేసి కుటుంబ పోషణ చేసుకుంటున్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే అప్పులు కూడా లభించే పరిస్థితి ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు తమ సమస్యను పంచాయితీ, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ఫలితం ఉండటం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని హరిత రాయబారులకు చెల్లించాల్సిన బకాయిలతోపాటు, ఏ నెలకానెల గౌరవవేతనాలను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేతనాలు క్రమం తప్పకుండా చెల్లించాలి

జిల్లాలో అనేక పంచాయతీలలో వేతనాలు సకాలంలో రాకపోవటంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా వేతనం చెల్లించేలా ఉన్నతాధికారులు చొరవ చూపించాలి. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలి. పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరిరక్షణకు ఉపకరణాలైన గ్లౌజులు, సబ్బులు, కొబ్బరినూనె తదితర సామాగ్రిని అందజేయాలి. కొన్ని పంచాయతీల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి సైతం కూలీలుగా వినియోగిస్తున్నారు. అటువంటి చర్యలు సరైంది కాదు.

-బి. రాజులోవ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

మహేంద్ర మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కొవ్వూరు నియోజక వర్గం దొమ్మేరు గ్రామానికి చెందిన దళిత యువకుడు బొంతా మహేంద్ర మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో వైసిపి గ్రూపుల పోరులో జరిగిన వివాదంలో గ్రామానికి చెందిన దళిత యువకుడు ఆత్మహత్య వరకూ దారితీసిన వైనం దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. జరిగిన ఘటనకు రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు వైసిపి, పోలీసులు కారణమైతే ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం సిగ్గుచేటన్నారు. గ్రామ వైసిపి గ్రూపుల పోరు నేపథ్యంలో దళిత యువకుడు బొంతు మహేంద్రను కొవ్వూరు పోలీస్ స్టేషన్లో నిర్బంధించారని తెలిపారు. దీంతో ఆ యువకుడు మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డారని, దీనికి పూర్తి బాధ్యత హోంమంత్రి బాధ్యత వహించాలని అన్నారు. దళిత యువకుడుని రోజంతా పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన నేపథ్యంలోనే ఆ యువకుడు భయాందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందని, ఈ వర్గపోరులో దళిత యువకుడు బలికావటం బాధాకరమని అన్నారు. మొత్తం జరిగిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తుచేయాలని డిమాండ్ చేశారు. చిన్న ఫ్లెక్సీ వివాదాన్ని ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో దళిత యువకుడి మృతికి కారణం అయిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు బి.పవన్, బి.రాజులోవ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - గోకవరం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఆదేశించారు. మండలంలోని గాదెలపాలెం, ఇటికాయలపల్లి, గోపాలపురం గ్రామాల్లో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయా గ్రామాల్లో నెలకున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి సిఎం జగన్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కమ్మిల అచ్చిబాబు, ధారా రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో వైసిపి నాయకులు జనపరెడ్డి సుబ్బారావు, దాసరి రమేష్, సుంకర వీరబాబు, గుల్లా ఏడుకొండలు, చింతల అనిల్, తోలేట్ రాంప్రసాద్, మడికి మైనర్ బాబు పాల్గొన్నారు.

పంటల దిగుబడి ఆశాజనకం

ప్రజాశక్తి - తాళ్లపూడి

వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని జిల్లా ప్రణాళిక కార్యాలయ ఉప గణాంక అధికారి పి.సోమరాజు అన్నారు. మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలో రైతులు ఉప్పునూరి అప్పాయమ్మ, ఎక్కిశెట్టి వెంకటేశ్వరరావులకు చెందిన పొలాల్లో గురువారం వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. 34 బస్తాలు వరి దిగుబడి వచ్చినట్లుగా గుర్తించారు. మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలో వరి 48 ప్రయోగాలు, మినుము ఆరు ప్రయోగాలు చేశామని, ఇప్పటివరకు 30 శాతం ప్రయోగాలు పూర్తయ్యాయని అన్నారు. రైతులంతా పంట కోత ప్రయోగాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గౌతమి, పశమ్మ, అసిఫా, రేవతి, ఇన్సూరెన్స్ ఏజెంట్ పోసి బాబు, డివిజినల్ కోఆర్డినేటర్ పండు, రైతులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్


క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్న చందన

ధవలేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ, ఇంద్ర స్వర్ణ నగర్, బత్తిన సుబ్బారావు కాలనీ, రాజీవ్ నగర్, వాంబే కాలనీల్లో సిసి డ్రైన్లను వెడల్పు చేసేందుకు ప్రతి పాదనలను సిద్ధం చేసినట్లు రూరల్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించే కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక రామ పాదాలు రేవు ను ఆయన సందర్శించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారి సూరిబాబుకు సూచించారు. ఈ పర్యటనలో వార్డ్ మాజీ నెంబర్ గోలి.దేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, కన్వీనర్ ఎస్.సురేష్ కుమార్, ప్రమోద్, సత్యగిరి పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు

వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఎస్‌సి వర్గీకరణ బిల్లును వచ్చే శీతాకాలం పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలుగు రాష్ట్రాల సమన్వకర్త పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ఉప్పరగూడెంలో జగజ్జీవన్ రావ్ విగ్రహం వద్ద ఈనెల 30న జరిగే చలో విజయవాడ మహాసభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధభేరి మహాసభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌సి సామాజికవర్గంలోని మాలలకే అన్ని రాజకీయ పార్టీలు పెద్దపీట వేశాయని, దాని వల్లే మాదిగలు వెనుకబడ్డారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి, టిడిపి, జనసేన, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు మాదిగ ఉప కులాలకు 21 అసెంబ్లీ, 4 పార్లమెంట్లు సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ పదవిని కూడా మాదిగలకే కేటాయించాలని అన్నారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం పక్కనే డాక్టర్ బాబు జగజ్జీవన్ రావ్ విగ్రహం పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల ఇన్‌ఛార్జ్ గల్లా వెంకట శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి రాంబాబు, బొబ్బిలి వెంకటరాజు, కొడమంచిలి గంగరాజు, కొల్లి సురేష్ పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

వచ్చే ఏడాది జనవరి 1 నాటికి నిర్ధారణ చేయాల్సిన ఓటర్ల జాబితాకు సంబంధించి ఉన్న పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీన గురువారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాధవీలత పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక సారాంశ సవరణ అనుగుణంగా ఎప్పటికప్పుడు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం చేయడం జరుగుతోందన్నారు. వివిధ రాజకీయ పార్టీల ద్వారా వచ్చిన 7061 అభ్యంతరాలను పరిష్కరించినట్లు చెప్పారు. డూప్లికేట్ ఓట్లు 572, చిరునామా మార్పు కి చెందిన 716, మరణించిన ఓటర్లు 5,773 మందికి చెందిన అభ్యంతరాలు నూరు శాతం హాజరై పరిష్కారం చేశామన్నారు. అదే క్రమంలో ఓటర్ల జాబితాపై క్లైమ్స్ అండ్ అబ్జెక్షన్స్ దరఖాస్తుకు డిసెంబర్ 9 వరకూ అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. వాటిని డిసెంబర్ 26లోగా పరిష్కారం చేసేందుకు అవసరమైన ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. ఒకే చిరునామా కింద పదికి మించి ఉన్న ఓటర్లు ఉన్న 1196 గృహాల్లో 14,791 మంది ఉన్నట్లు గుర్తించామని, వాటిలో 10,985 ఓటర్లు సరైనవిగా, 3761 ఓటర్ల ఇంటి చిరునామా మార్పు చెందిన ఫారం 8 స్వీకరించినట్లు తెలిపారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భవిష్యత్తు బాగుండాలంటే బాబు రావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆదిరెడ్డి

భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ చంద్రబాబే ముఖ్యమంత్రి కావాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 3వ డివిజన్లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. టిడిపి నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. టిడిపి హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. టిడిపి-జనసేన కూటమి అధికారం చేపట్టిన తరువాత మేనిఫెస్టో ప్రకారం యువతకు ఉపాధి కల్పన, మహిళలకు మూడు సిలిండర్లు ఉచితం, ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణం, పిల్లల భవిష్యత్ వంటి అనేక కార్యక్రమాలు అమలు చేసి ప్రజలను కష్టాల నుంచి గట్టెక్కిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, మాజీ కార్పొరేటర్ బొమ్మనమైన శ్రీనివాస్, అండలూరి చంద్రశేఖర్, అండలూరి సత్యనారాయణ, అహ్మదున్నీషా బేగం, దమరసింగ్ బ్రహ్మజీ, పెందుర్తి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

దేవరపల్లి: అందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌దేనని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. మండలం చిన్నాయగూడెం గ్రామంలో ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిందన్నారు పేదలకు అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.దుర్గారావు, మండల నాయకులు సతీష్, గెడా జగదీశ్, గ్రామ సర్పంచ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఉండ్రాజవరం: మండలంలోని చిలకపాడులో రూ.3 కోట్లు, చివటంలో రూ.2.5 కోట్లు, తాడిపర్రులో రూ.2.25 కోట్ల వ్యయంతోనూ, జల జీవన్ మిషన్ పథకంలో నిర్మించే మంచి నీటి ట్యాంక్, పైపులైన్ పనులు, బోరు, కుళాయి ఏర్పాటు పనులకు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామ సర్పంచులు, జడ్‌పిటిసి, ఎంపిపి, గ్రామ సొసైటి అధ్యక్షులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడియం: మండలంలోని కడియపులంక గ్రామం చర్చి వీధిలో ఇటీవల ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయిన పల్లి కుమారికి రూరల్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆర్థిక సాయాన్ని అందించారు. గురుదవారం పల్లి కుమారి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, ఉటుకూరి శైలజ, చీకట్ల మాసారయ్య, బోడపాటి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ, ట్యాంకు పనుల పరిశీలన

గోకవరం: స్థానిక అరవపేట కొత్త వీధులో నూతనంగా నిర్మిస్తున్న డ్రయినేజీ, వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను పంచాయతీ వార్డు మెంబర్ మందపాటి రత్నకుమారి ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడటంతో ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లగా పంచాయితీ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారని, ఆ నిధులతో వాటర్ ట్యాంకు నిర్మాణంతోపాటు, డ్రయినేజీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో వైసిపి నాయకులు ఎం.సతీష్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, అబ్రహం పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చాగల్లు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి అన్నారు. గురువారం స్థానిక సచివాలయం- 2లో ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో సిఎం జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జుట్ట.కొండలరావు, గెడ శ్యామ్, చెల్లింకుల దుర్గ మల్లేశ్వరరావు, బొర్రా కృష్ణ, జాలెం వెంకట్రావు, శీలి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు కుందుల పరామర్శ

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రులో నిడదవోలు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ గురువారం పలు కుటుంబాలను పరామర్శించారు. గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన అరిగెల ఏసు కుమారుడు అరిగెల సత్తిపండు, అరిగెల శేఖర్ మామ అరిగెల చిన్నాలు కుటుంబ సభ్యులను వారి నివాస గృహాలకు వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

పలు భవనాలకు చందన ప్రారంభోత్సవం

కడియం: మండలంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, హెల్త్ వెల్నెస్ సెంటర్ భవనాలను రూరల్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి కావాలంటే మళ్లీ జగనే సిఎం కావాలని, నిరంతరం పేద ప్రజల కోసం పరితపించే వ్యక్తి జగన్ అని, నాలుగున్నర సంవత్సరాల కాలంలో సుమారు 21 కోట్ల రూపాయలతో కడియం గ్రామాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. వేమగిరి జగనన్న లే అవుట్ 3 ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వేమగిరిలో ఆటోస్టాండ్ కు స్థలం మంజూరు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మండల పార్టీ అధ్యక్షులు వై.సతీష్ చంద్ర స్టాలిన్, జెసిఎస్ కన్వీనర్ తాడాల విష్ణు చక్రవర్తి, నాయకులు భీమిరెడ్డి నాగేంద్ర, దొంతంశెట్టి భద్రయ్య, ఈలి గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్‌ను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - గోకవరం

ప్రభుత్వ పెన్షనర్స్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోసం చేసిందని పెన్షనర్స్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల మంగరాజు అన్నారు. పెన్షన్ ఫౌండేషన్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద గురువారం పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ 1995 నవంబర్ 26న కేంద్రప్రభుత్వం ఇపిఎస్-95 అనే పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరికి ఈ పెన్షన్ వర్తిస్తుందని వివరించారు. ఈ పెన్షన్ రూ.1000 లోపు పెన్షన్ పొందడం జరుగుతుందని, ఈ పెన్షన్ వల్ల కుటుంబ పోషణ కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలు దఫాలుగా కార్మికులు అధికారులకు విన్నవించినా మార్పులు చేస్తామని కేంద్రంలోని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. గత 28 సంవత్సరాలుగా ఒక్క రూపాయిని కూడా అదనంగా పెంచింది లేదన్నారు. 2014లో లోక్‌సభలో జవదేకర్ పెన్షన్‌ను రూ.5 వేలు చేస్తామని ప్రకటించారని, అయితే తొమ్మిదిన్నరేళ్లు అవుతున్నా ఒక్క రూపాయి కూడా పెంపుదల చేయలేదని ఆయన ఆరోపించారు. కేంద్రప్రభుత్వం చేసిన మోసాన్ని నిరసిస్తూ పెన్షన్ ఫౌండేషన్ డేని విద్రోహ దినంగా పెన్షనర్స్ భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం కనిస వేతనం రూ.18 వేలు ఇస్తుందని, దానిలో సగం రూ.9 వేలను పెన్షన్‌గా ఇవ్వాలని, మెడికల్ సౌకర్యాన్ని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై.మాధవరావు, పి.సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, బి.సుబ్బారావు, సి.నాగేశ్వరరావు, వై.పెరిమల్లు, జి.ప్రసాద్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

కార్టూన్ 'నిజం'



అందుకే పండగ మామూళ్లు ఇస్తున్నామయ్యా..!! తప్పేముందీ..!!!

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుందాం

ప్రజాశక్తి - యంత్రాంగం


ఉండ్రాజవరంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

గ్రంథాలయాలను వినియోగించుకుని విద్యారంగంలో ఉన్నతంగా రాణించాలని పలువురు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని పలు మండలాల్లోని శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి కార్యక్రమాలు నిర్వహించారు. **తాళ్లపూడి** స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జి.రాజకుమార్, పి.సత్యనారాయణ, జి.రాఘవరావు, ఎం.సత్యనారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 6, 7 తరగతుల విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం, 8, 9 తరగతుల విద్యార్థులకు కళాశాల విద్య ప్రాముఖ్యత అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపన్యాసకులు కోట రామ ప్రసాద్, గ్రంథాలయ అధికారి గుత్తికొండ కృష్ణారావు, ఉపాధ్యాయులు ఐ.పుష్పవతి, సిహెచ్.శ్రీను, హెచ్.అమరావతి, డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** మండలంలోని చంద్రవరంలో పాత్రికేయుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ విశిష్టతను తెలియజేస్తూ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. అలాగే చాగల్లు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల అనర్థాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ కోడి నాగేశ్వర రావు, గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద యువజన సమితి ఆధ్వర్యంలో రోబోట్రిక్స్ కిట్, ఎలాక్ట్రానిక్స్ కిట్, హైడ్రాలిక్ కిట్, టచ్ సెన్సార్ మోటార్స్, ఫ్లేమ్ డిటెక్షన్ సెన్సార్‌లపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులకు జూనియర్స్ మరియు సీనియర్స్ విభాగంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ జె.ఉదయశ్రీ, వివేకానంద యువజన సమితి అధ్యక్షులు ఎస్.రాఘవేంద్రరావు పాల్గొన్నారు. **గోకవరం** స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి కె.ప్రియదర్శిని ఆధ్వర్యంలో మూడో రోజు గ్రంథాలయ ఉద్యకారుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. **గోపాలపురం** స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వెలుగు, సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం, మినీ మిరాకిల్, బాపూజీ కాన్వెంట్, జిల్లా పరిషత్ హైస్కూల్స్ నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరిచినట్లు లైబ్రేరియన్ వెజ్జు సత్యనారాయణ తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యాపారి మృతి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి నరాలసెట్టి చక్రధర్ (52) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీ మాండవ్య నారాయణస్వామి ఆలయ సమీపంలో నరాలశెట్టి చక్రధర్ కొబ్బరి కాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురయ్యాడు. రెండు రోజులు క్రితం పురుగుల మందు తాగాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని స్థానికులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో మామిళ్లదొడ్డి వంతెన సమీపంలో ప్రయాణికులతో కాకినాడ వెళుతున్న ఆటోను కాకినాడ నుంచి పెద్దాపురం వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును హైడ్రా సాయంతో పోలీసు స్టేషన్‌కు తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

నలుగురిపై సారా కేసులు నమోదు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో అధికారులు దాడులు నిర్వహించి సారాను విక్రయిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు. 1,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, 40 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఎస్ఇబి సిఐ పి.అశోక్ మాట్లాడారు. గెద్దనాపల్లిలో 600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం రామకృష్ణాపురం గ్రామంలో 20 లీటర్ల నాటు సారా, గోకవరంలో 600 లీటర్ల బెల్లపు ఊట ద్వంసం చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

దొమ్మేరులో ఉద్రిక్తత

- హోం మంత్రి వనితకు చుక్కెదురు
- దళిత యువకుడు మహేంద్ర అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి- కొవ్వూరు, రాజమహేంద్రవరం ప్రతినిధి

ఫ్లెక్సీ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న బొంతా మహేంద్ర(21) అంత్యక్రియలు గురువారం పూర్తయ్యాయి. మహేంద్ర మృతికి అధికార పార్టీలో వర్గ విభేధాలే కారణమని రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. స్థానిక ఎంఎల్ఎ, హోం మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునలను పరామర్శకు పంపించింది. ఈ నేపథ్యంలో దొమ్మేరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వచ్చిన హోం మంత్రి తానేటి వనితను స్థానికులు కారు దిగనివ్వలేదు. పోలీసుల సహకారంతో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ మాత్రమే కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రుల రాక నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ స్థానికులు తీవ్ర స్థాయిలో ప్రతిఘటించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ఒక దశలో పోలీసులు, గ్రామస్తుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీసులు ఆందోళన కారులను చెదరగొట్టి మహేంద్ర ఇంటి వద్దకు అతికష్టం మీద తీసుకెళ్లారు. పరామర్శించిన అనంతరం ప్రభుత్వ సలహాదారు రాజీవ్ కృష్ణ రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి మేరుగ నాగార్జున రూ.10 లక్షలు చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. హోం మంత్రి తానేటి వనిత విజయం కోసం మహేంద్ర పనిచేశాడని, పోలీసులు నిర్బంధించారంటే కనీసం పట్టించుకోలేదని, ఆమె దృష్టికి తీసుకెళ్లినా ఒక్క ఫోన్ కూడా చేయలేదని కుటుంబ సభ్యులు మంత్రుల ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సారి ఎన్నికల్లో తానేటి వనతి ఎలా గెలుస్తారో చూస్తామంటూ హెచ్చరించారు. తన చావుకు కారణం కొవ్వూరు స్టేషన్ ఎస్ఐ భూషణం, వైసిపి నాయకులు నాగరాజు, సతీష్ కారణమంటూ మృతుని వాంగ్మూలం దొరికినట్లు వార్తలు విన్పించాయి.

సిపిఎం నాయకుడు జువ్వల రాంబాబు గృహ నిర్బంధం

దొమ్మేరు ఘటనల నేపథ్యంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పోలీసుల వేధింపులు తాళలేక దొమ్మేరులో బొంతా మహేంద్ర అనే దళిత యువకుడు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మహేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు గురువారం మంత్రులు దొమ్మేరు గ్రామానికి చేరుకున్నారు. మంత్రుల రాక నేపథ్యంలో జువ్వల రాంబాబును పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

గృహనిర్బంధం అక్రమం : సిపిఎం

దొమ్మేరు ఘటన నేపపథ్యంలో మంత్రులు వచ్చిన సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబును అక్రమంగా నిర్బంధించడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల తీరును ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలన్నారు.


మృతుని తల్లికి చెక్కును అందిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున


గృహనిర్బంధంలో ఉన్న జువ్వల రాంబాబు

రసాబాసగా టిడిపి, జనసేన ఆత్మీయ సమావేశం

వేదికపైనే నాయకుల మధ్య తోపులాట

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం జడ్.రాగంపేట శివారున గురువారం పరిణయ ఫంక్షన్ హాల్‌లో టిడిపి, జనసేన పార్టీల మధ్య జరిగిన ఆత్మీయ సమావేశం రసాబాసగా మారింది. టిడిపి, జనసేన నాయకులు వేదికపైనే తోపులాటకు దిగడం చర్చనీయాంశమైంది. గోకవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, టిడిపి కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగి కాలు విరిగిందని, సమావేశానికి ముందు జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర ఆధ్వర్యంలో జనసైనికులు ఫంక్షన్ హాలు గేటు వద్ద బైటాయించారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి జ్యోతుల నెహ్రూ వచ్చి సమాధానం చెప్పాలంటూ ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న జ్యోతుల నెహ్రూ పాటంశెట్టి వద్దకు వెళ్లి మాట్లాడారు. సమస్యలుంటే సమావేశం అనంతరం కూర్చుని సామరస్యంగా చర్చించుకుందామని తెలిపారు. లోపలికి రమ్మని ఆహ్వానించారు. నెహ్రూ ఎంత చెప్పినా వినక పోవడంతో ఆయన సమావేశానికి వెళ్లారు. జనసేన నాయకులు తుమ్మల బాబు సమావేశానికి వచ్చి సూర్యచంద్రకు, జనసైనికులకు సర్ధి చెప్పి సమావేశానికి తీసుకెళ్లారు. వేదికపైకి వెళ్లగానే సూర్యచంద్ర ఘర్షణ విషయాన్ని ప్రస్తావించారు. బాధితులకు క్షమాపణ చెప్పాలని నెహ్రూపై ఒత్తిడి తెచ్చారు. ఈ సమయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, సూర్యచంద్ర మధ్య తోపులాట జరిగింది.



వేదికపై టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల తోపులాట

సూర్యచంద్రకు టిక్కెట్ ఇస్తే సహకరించేది లేదు : నెహ్రూ

ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేట ఎంఎల్ఎ టిక్కెట్ పాటంశెట్టి సూర్యచంద్రకి ఇస్తే తాను సహకరించబోనని స్పష్టం చేశారు. సాధారణ జనసేన కార్యకర్తకు ఇచ్చినా పని చేస్తానని తెలిపారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలయికతో ఆత్మీయ సమావేశం పెట్టుకున్నామని, కొంత మంది రాజకీయ కక్షలతో సమావేశాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించారన్నారు. 45 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏ సమావేశంలోనూ జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఘర్షణ అనంతరం యధావిధిగా సమావేశం శాంతియుతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తుమ్మల బాబు, వరుపుల తమ్మయ్యబాబు, సూరంపాలెం బాలు, టిడిపి నాయకులు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, ఎస్‌విఎస్.అప్పలరాజు, కోర్పు లచ్చయ్యదొర, పోతుల మోహన్ రావు, కొర్పు సాయి తేజ, యర్రంశెట్టి బాబ్జి, కొత్త కొండ బాబు, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

60 మంది ట్రైనీలకు కిట్లు అందజేత

ప్రజాశక్తి - యానాం

నిరుద్యోగ యువతకి నేషనల్ అర్బన్ లైవ్ హుడ్ మిషన్ పథకం ద్వారా యానాం మున్సిపల్ కార్యాలయంలో కొరియర్ డెలివరీ ఎగ్జిక్యూటివ్ కోర్స్‌లో శిక్షణ పొందిన 60 మందికి కిట్లను ఆర్ఎఒ మునిస్వామి గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఖండవల్లి రామకష్ణ, ఎసిఒ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీలక్ష్మీభాయి జయంతి

ప్రజాశక్తి - యానాం

రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని గురువారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ బీచ్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ షణ్ముగం, ఎస్ఐ నూకరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిక్రియా నగర్ హై స్కూల్ రోడ్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర యానాం శాఖను పరిపాలనాధికారి మునిస్వామి గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు మంచి సర్వీస్ ఇచ్చి ఖాతాదారుల నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విజయవాడ జోనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ 41వ శాఖ యానాంలో ప్రారంభించామని తెలిపారు. ప్రజలు తమ బ్యాంకును ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ వివిఎస్.రామ్‌మోహన్ పరిపాలనాధికారి మునిస్వామిని దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, యానాం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఈలప్రోలు విష్ణువర్ధన్ రావు, యానాం వర్తక సంఘం ప్రతినిధులు మాజేటి సత్యభాస్కర్, నల్లా వెంకన్న, ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లాడి శామ్యూల్, యానాం కాపు సంఘం ప్రెసిడెంట్ కాటంశెట్టి వెంకట రామ్మూర్తి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సత్యలక్ష్మికి మెడికల్ సీట్ కేటాయించాలని ఉత్తర్వులు

ప్రజాశక్తి - యానాం

ఇడబ్ల్యుఎస్‌లో కోన జయసత్యలక్ష్మికి మెడికల్ సీటు కేటాయించాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె మెడికల్ సీటు పొందాల్సి ఉండగా ఆ సీటును మేనేజ్‌మెంట్ కోటాలో మరొకరికి కేటాయించారు. ఈ నేపథ్యంలో విద్యార్థి తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేసి జయ సత్యలక్ష్మికి కచ్చితంగా 10 శాతం ఇడబ్ల్యూఎస్ కోటాను అమలు చేసి సీటు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

అంబాజీపేటలో కార్డియాలజీ సేవలు

ప్రజాశక్తి-అంబాజీపేట

అంబాజీపేట వాసవి కాంప్లెక్స్ ఎదురుగా ఉషా క్లినిక్, డయాబెటిక్, జనరల్ వైద్య నిపుణులు, కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ ప్రతినెలా మొదటి గురువారం, మూడవ గురువారం అందుబాటులో ఉంటారన్నారు. గుండె వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డుకిరువైపులా వాహనాల నిలిపివేత

ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా ఉండే మండపేట నుంచి ఏడిద మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే రహదారిలో రోడ్డుకిరువైపులా లారీలను నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం కలుగుతుంది. ఈ రోడ్డు మార్గంలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం తదితర సరుకులను ఇతర రాష్ట్రాల నుంచి భారీ వాహనాల్లో తీసుకొస్తుంటారు. మిల్లుల్లో సరుకు దిగుమతి చేసే వరకు వాహనాలను రోడ్డు చెంతనే నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు మార్గం ఇరుకుగా మారడంతో పాటు రోడ్డు అంతా గోతులు మయంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

చొప్పెల్ల ఆసుపత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల పశువైద్యాశాలను పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.అనిత గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యుల పనితీరుపై రైతులను అడిగి ఆరా తీశారు. సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆమె మాట్లాడుతూ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆమె వెంట వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు కె.భానుప్రసాద్, తిరుమలరాజు ఉన్నారు.


టిడిపి, జనసేన నాయకులు సంఘీభావం

రాష్ట్ర క్షేమం కోసమే కలయిక

ప్రజాశక్తి-కొత్తపేట

జగన్ రాక్షస పాలన అంతమొందించి రాష్ట్ర ప్రజల క్షేమం కోసమే టిడిపి, జనసేన పార్టీలు ఏకమయ్యాయని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక బండారు బులిసత్యం చంద్రావతి కాపు కళ్యాణమండపంలో టిడిపి, జనసేనపార్టీ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలు చాలా నష్టపోయారని, వారి ఆదుకోవడం కోసం, వైసిపి నాయకుల అక్రమాలు, అవినీతిని అడ్డుకునేందుకు టిడిపి, జనసేన పార్టీలు కలిసి పోరాటం చేయాలన్నారు. జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ మాట్లడతూ ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ఎలాంటి పొరఫాట్లు రాకుండా ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలోవాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకష్ణ, శోడిశెట్టి చంద్రశేఖర్, తాళ్ల డేవిడ్ లలో పాటు తెలుగుదేశం, జనసేన పార్టీల సమన్వయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

జనగణనతో పాటూ కులగణన

మంత్రి వేణు గోపాలకృష్ణ

ప్రజాశక్తి - అమలాపురం

జన గణన మాదిరిగానే కుల గణన కూడా పదేళ్లకోశారి జరగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ కులగణనకు శ్రీకారం చుట్టారని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,600 పైచిలుకు వరకు కులాలు, ఉప కులాలు ఉన్నాయన్నారు. కులాల ఆకాంక్ష మేరకు వారికి ప్రాతినిధ్యం ఎలా ఉన్నది అనేది తెలుసుకునేందుకు కులగణనను చేపట్టామన్నారు. 1951 నుంచి జనగణన మాత్రమే జరుగుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు తప్ప మిగిలిన కులాల గణన జరగలేదని ఉద్యమాలు జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా కుల గణన ప్రస్తావన వచ్చిందన్నారు. ఈ గణన కోసం బిసి, ఎస్‌సి, మైనారిటీ, ఎస్‌టి ముఖ్య కార్యదర్శులతో కమిటీని నియమించారన్నారు. ఇటీవల పైలెట్ ప్రాజెక్టు మూడు గ్రామ వార్డులు రెండు వార్డు సచివాలయాల్లో నిర్వహించి ప్రక్రియను నిశితంగా పరిశీలించారన్నారు. ఈ సర్వే ఆధారంగా ఆయా కులాల అభ్యున్నతికి జనాభా ప్రాతిపదికన సంఘ నాయకుల సూచనలను పరిగణనలో తీసుకుంటా మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియకు సంబంధించి ఐదు చోట్ల ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుల్లో అభిప్రా యాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో జెసి కులగణన సర్వేకు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో వాలంటీర్ యాప్‌లో 20 అంశాల ప్రశ్నావళిని ఆన్‌లైన్‌లో నింపి అందిస్తామన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రత్నగిరి ఇఒ ఆజాద్ ఆకస్మిక బదిలీ

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానం ఇఒ ఎస్.చంద్రశేఖర్‌ఆజాద్ ఆకస్మికంగా బదిలీ కావడంపై పలు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ సంవత్సరం మార్చిలో ఆజాద్ దేవస్థానం ఇఒగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆనతికాలంలోనే దేవస్థానంలో తన దైన శైలిలో అనేక చర్యలు తీసుకున్నారు ముఖ్యంగా స్వామివారి వైదికపరంగా చేయాల్సిన కార్యక్రమాల పట్ల గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు గుర్తించే విధంగా నిర్వహించారు. సుమారు రూ.15 కోట్ల వ్యయంతో 67 అభివృద్ధి పనులు చేపట్టారు. ఉద్యోగులందరూ బాధ్యతగా మెలిగెల క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. కీలక విభాగాల్లో దోపిడీకి అడ్డుకట్ట వేశారు. ఇది సహించని వారు ఆజాద్‌ను బదిలీ చేయాలని అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. ఆయన వచ్చిన ఆరు నెలలకే బదిలీ చేయించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఆజాద్ ప్రస్తుతం శ్రీకాళహస్తి దేవస్థానానికి బదిలీ అయ్యారు

నేను లోకల్... నాకు ఓటేయ్యండి

రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్

ప్రజాశక్తి-రాజోలు

స్థానికుడు అయిన తకు ఓటు వేస్తే నిత్యం ప్రజల్లో తిరుగుతూ నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తానని, వలస నాయకులను గెలిపిస్తే గెలిచిన తర్వాత కంటికి కనపడరని సంచలన వాఖ్యలు చేశారు. రాజోలు ఎల్ఐసి రోడ్డును గురువారం ఆయన ప్రారంభించారు. వారాహి యాత్రలో భాగంగా రాజోలు గుండా ప్రయాణించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ రోడ్డు దుస్థితిని చూసి 15 రోజుల్లో రోడ్డు వేయక పోతే తానే స్వయంగా వచ్చి శ్రమదానం చేసి రోడ్డు నిర్మిస్తానని సవాల్ విసిరారు. అయినా రోడ్డు నిర్మాణంలో జాప్యం జరగడంతో పలు మార్లు జనసేన నాయకులు రోడ్డు మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చారు. ఎట్టకేలకు ఎంఎల్ఎ రాపాక చొరవతో రూ.90 లక్షల నిధులతో కనకదుర్గ గుడి నుంచి రాజోలు సెంటర్ వరకు సిసి రోడ్డు, డ్రెయినేజీని నిర్మించారు. ఈ సందర్భగా సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంఎల్ఎ రాపాక మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపినాయకులు ఎల్ఐసి రోడ్డులో చీపుర్లు పట్టుకుని ఫోటోలకు ఫోజులు ఇచ్చారన్నారు. తాను ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు నిర్మాణంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థనూ ఏర్పాటు చేశానని తెలిపారు. అలాగే రూ.80 లక్షలతో పాత ఎమ్‌డి గారి ఆసుపత్రి రోడ్డుకు శంకుస్థాపన చేశామని తెలిపారు. పార్టీలకు, మతాలకు అతీతంగా తనను మరోమారు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు మట్టా శైలజ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, ఎంపిటిసి సభ్యులు చెల్లింగి ఈశ్వరి, కె.పుష్పలత, స్థానిక నాయకులు దార్ల పెదబాబు, కెఎస్‌ఎన్.రాజు, కంచర్ల శేఖర్, మట్టా ఏడుకొండలు, అధికారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంలో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం తానా సెంటర్ వద్ద సుమారు రూ.10 కోట్లతో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన వంతెన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని జడ్‌పిటిసి మాజీ సభ్యులు పాలూరి బోసుబాబు ఆరోపించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గోకవరం మీదుగా భద్రాచలం, పాడేరు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ వంతెన ఎంతగానో అవసరం అన్నారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన పాత వంతెన ఇరుకుగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాట్మెంట్‌కు సంబంధించిన అనేక అనుమానాలు, అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో సరైన ప్రణాళిక కాకుండా స్థానిక అఖిలపక్ష నాయకులను సైతం సంప్రదించకుండా హడావిడిగా వంతెన పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. భూసేకరణ చేయకుండా వంతెన పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నిర్మాణం వల్ల నష్టంపోయిన వారితో సంప్రదింపులు జరిపి వంతెన నిర్మాణానికి ఉన్న అభ్యంతరాలను పరిష్కరించి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.

పాలంగి ఉపసర్పంచ్ పదవి ఏకగ్రీవం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పాలంగి గ్రామంలో 12వ వార్డు సభ్యుడు వెలివెల వెంకట సీతా రామారావు ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఇఒపిఆర్‌డి జిడెవి.ప్రసాద్ గురువారం తెలిపారు. ఇంత వరకు ఉపసర్పంచ్‌గా ఉన్న మేళం రాజకుమారి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక నిర్వహించామన్నారు. 10వార్డు సభ్యుడు బసవ యేసు నాయుడు ప్రతిపాదించగా, 3వార్డు సభ్యుడు కడలి రవికుమార్ బల పరిచారు. దీనితో ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ రామారావుకు సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డి.హాసన్ జానీ, నాయకులు పాలాటి శరత్ బాబు, వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు.

రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి -కరప

స్కూల్ గేమ్స్ ఆటల పోటీలో భాగంగా కర్నూలులో ఈనెల 17 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారని హెచ్‌ఎం మోహన్ తెలిపారు. అండర్ -14, 17 బాలురు బాలికలు విభాగాల్లో జట్లను ఎంపిక చేశారు. తొలుత సర్పంచ్ శ్రీనివాసరావు క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతో పాటూ ఆటల్లోనూ రాణించాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసి ఛైర్మన్ పబ్బినీడి వీరబాబు, ఎంపిటిసి సభ్యులు వై.వీరవేణి, కాకినాడ రూరల్ జోన్ అధ్యక్షుడు వి.మాచారావు, పిఠాపురం టౌన్ జోన్ అధ్యక్షుడు వి.హరిబాబు, తాళ్లరేవు జోన్ కోశాధికారి ఆర్. దుర్గా ప్రసాద్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

బాస్కెట్ బాల్ జట్టుకు ప్రగతి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రగతి హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు మదనపల్లిలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-14 బాస్కెట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రగతి విద్యార్థి సిహెచ్.కిరణ్‌రాజ్‌ను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ నూతలపాటి హిమబిందు తెలిపారు. ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ హిమబిందు, చైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు, ఎజిఎం ఎస్.అనిల్‌బాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్‌ఆర్.సత్యనారాయణ విదార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.సురేష్, పిఇటిలు జి.సూరిబాబు, సూర్యకుమారి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు

'వైసిపితోనే సంక్షేమ పాలన'

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన వైసిపితోనే సాధ్యమని ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. గురువారం మునికూడలి, రాజంపేట గ్రామాల్లో గడప గడపకఊ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయాలతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందన్నారు. ప్రజా సాధికారతే లక్ష్యంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, వైసిపి మండల కన్వీనర్ గంటా శ్రీను, కో-కన్వీనర్ కరటూరి హరిబాబు, సేవా దళ్ అధ్యక్షులు డాక్టర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.